# దువ్వెనల సాయెబు

"దువ్వెనలు కోస్తా! కొమ్ముదువ్వెనలు కోస్తా" అంటు దువ్వెనల సాయెబు ఆ వీధిలో అడుగు పెట్టాడు.

ఆ వీధి వారందరు ఆ గొంతు వినబడగానె ఆశ్చర్యపోయారు. అతను తిరిగి ఆ వూరు వస్తాడని కాని, తిరిగి అతని గంతు వినబడుతుందని కాని ఆ వూరి వారెవరు ఊహించలేదు. ఆ గొంతు దగ్గరవుతుంటె ఆ వీధుల్లోని వారంతా నిలబడి అటే చూస్తున్నారు.

"దువ్వెనలు కోస్తా! కొమ్ము దువ్వెనలు కోస్తా" ఆ గొంతు మరింత దగ్గరై, ఆ వ్యక్తి ఎదురుగా కనిపించాడు.

"ఏమయ్యా! సాయెబు! సామానంతా సర్దుకొని కొడుకు దగ్గరకు ఢిల్లీ వెళ్లిపోయిన వాడివి నెల తిరక్కుండానే తిరిగి వచ్చావేమిటయ్యా?"

వీధి అరుగు మీద కూర్చుని పేకాడుతున్న ఆనందరావు ఆసక్తిగా అడిగేసరికి దువ్వెనల సాయెబు ఏమి చెబుతాడోనని అందరూ మరింత కుతూహలంగా అతనివైపు చూస్తున్నారు.

"కొడుకు సరిగా ఆదరించలేదేమో? కోడలు విసుక్కుంటుందేమో?" చేతిలో ఉన్న పేక ముక్కలు కింద పడేసి మరీ అడిగాడు చలపతి.

"మధ్యలో నీ చొప్పదంటు ప్రశ్న లేమిటయ్యా! అతన్ని చెప్పనీ!" వీరేశం విసుక్కున్నాడు.

వెంటనే సాయెబు భుజాన ఉన్న సంచీ పక్కన పెట్టుకుని అరుగు మీద ఓ వారగా ఆనందరావుకు ఎదురుగా వెళ్ళి కూర్చున్నాడు. అలా కూర్చుని వారితో మాట్లాడటం సాయెబుకు అలవాటే! అతను ఆ వూరి వారిలో ఒకడిగా, వారితో కలసి మెలసి బతుకుతున్నాడు.

"అదికాదు బాబూ! నా కొడుకు చాలా మంచోడు. నన్ను నా యింటిదాన్ని ప్రేమగానె చూసుకున్నాడు! ప్రేమ ఎక్కువైతే భరించడం కూడా కష్టమేనయ్యా!" చెప్పడం ఆపి సాయేబు అందరి వైపు చూసాడు.

"అదేమిటో త్వరగా చెప్పక ననుగుతావేమయ్యా!" అందరూ ఒకేసారి అడిగారు.

"కోడలు విసుక్కుందేమో?" చలపతి అనుమానం వ్యక్తం చేసాడు.

"అది కాదయ్యా! కోడలూ మంచిదే! మాకు కావలసినవన్నీ అడక్కుండానే వంటామెచేత చేయించి పెట్టేది. మా యింటామెకు చేతికి పని లేక తోచేదికాదు. కష్టించే చేతులవి! పని లేకుండా బతకటమెట్లా గయ్యా!" ఉసూరుమంటూ చెప్పాడు సాయేబు.

"ఓసి ఇంతేనా? కాలు మీద కాలు వేసుకుని కూర్చుని సుఖపడక బాధ పడతావేమిటయ్యా! ఇన్నాళ్ళు కష్టపడింది చాలు కదా!" ఆనందరావు నవ్వుతూ అన్నాడు.

"మీరు చెప్పింది నిజమేనయ్యా! కాని మాకూ కొన్ని సరదాలుంటాయి కదా! మనవలకి సబ్బుతో స్నానం చేయించి చక్కగా బట్టలు వేసి, గోరు ముద్దలు చేసి మనవలకి అన్నం తినిపించాలని సరదాపడేది మా యింటిది. మరి మనవల చేయి పట్టి సాయం వేళ పార్కులో తిప్పాలని వారి ముద్దు ముద్దు మాటలు వినాలని సరదా పడిపోయే వాడిని కాని ఆ పిల్లలకి మాతో ఉండే అవకాశమే లేదు. పొద్దుట బడికి వెడితే సాయం కాలం వస్తారు. వెంటనే మరో పంతులు చదివించటానికి వస్తాడు. ఇంక మా దగ్గర అలవాటే లేదు గదయ్యా! పైగా అసలు సంగతి వారికి మా బాసరాదు. వారి బాస మాకు రాదు! ఇంక పిల్లలతో మాకేమి సరదా బాబూ!" అలా సాయేబు చెబుతుంటె సాయేబు కళ్ళల్లో చిన్న వడగళ్ళంత కన్నీళ్ళు నిలిచాయి. పై గుడ్డతో తీసి తుడుచుకున్నాడు.

"అయ్యో పాపం ఇదో కొత్త సమస్య కాబోలు ఇది వరకు మనం వినలేదు!" అనుకుంటూ అరుగు మీద ఉన్నవాళ్ళంతా కూడా కళ్ళొత్తుకున్నారు. గుండె గుండెకు ఉన్న మానవ సంబంధం కాబోలు. మనసులు కలిస్తే కష్టాలు కలుస్తాయి కదా!

"అదేం కాదు బాబూ! ఢిల్లీలో చలి మరీఎక్కువయ్యా! మా యింటిదాని పాత నూలు చీరలు చలేమాపుతాయి బాబూ! చలితో గజగజా వణికామనుకోండి? పైగా మా వేష బాసలు చూసి నా కొడుకు ఇంటికి వచ్చిన వాళ్ళంతా పల్లెనుంచి పని

వాళ్ళం వచ్చామని ముఖం మీదే చెప్పుకునేవారు. నా కొడుకు ఎంతో ఇష్టంతో తెచ్చిన పొడుగు లాగులు, పొడుగు చొక్కాలు, స్వెట్టర్లు నేను వేసుకుని తిరగ లేకపోయా! పైగా మా యింటిది ఆ మంచి చీరలు కట్టుకుని, స్వెట్టర్లు వేసుకుని తిరగలేకపోయిందయ్యా! అసలే ఆమెకు ఉబ్బసం! అది కాస్త ఎక్కువైపోయింది బాబూ! ఇంక అక్కడ ఉండలేక తిరిగి బయలు దేరాం! కాని వచ్చింది మొదలు నా యింటిది అటు కొడుకుని చూడకుండ ఉండలేక మంచం దిగడం లేదయ్యా! ఏమవుతాదో ఏమో?" ఇంక సాయేబు చెప్పలేక పోయాడు. దుఃఖంతో గొంతు పూడుకు పోయింది.

"బాధ పడకు సాయేబు! మంచి మందు ఇప్పించు అదే తగ్గిపోతుంది! అందుకే కొంప అమ్మకుండా ఉంచుకోమన్నా! చూసావా? అయినా ఏదో శాశ్వతం కాదని తెలిసినా కష్టాలు కొని తెచ్చుకోకూడదు సాయేబు!" ధైర్యం చెప్పాడు ఆనందరావు.

"అవును బాబూ! ఆ కొంప ఉండబట్టే నేను, నా యింటిది ఆ కొంపలో పడి ఉన్నాం! లేకపోతే రోడ్డున పడేవాళ్ళమయ్యా! అది కాదు బాబూ! నా కొడుకు కొత్త యిల్లు కట్టించి పెడతానండున్నాడయ్యా! కాని మేమా కాటికి కాళ్ళు చాచుకుని ఉన్నాం! ఆ కొంపలో ఉండేదెవరయ్యా! లేనిపోని తాపత్రయమెందుకయ్యా!" సాయేబు కంఠంలో ఏదో నిరాశ ధ్వనించింది.

"అలా అనకు సాయేబు! నీ కొడుకు, కోడలు, మనవలు వచ్చి పోతూ ఉంటారు కదా! తాటాకు పాకలో ఏముంటారు! ఇల్లు కట్టించి కొడుకు ఇస్తామంటె వద్దనకు?" అక్కడి వారంతా సలహా ఇచ్చారు.

"ఈ రోజుల్లో అందరు పిల్లలకు దూరంగా ఉండలేక వృద్ధాశ్రమాలకి తరలి వెడుతున్నారు. మనం అటేపోదాం! సాయేబు బాధపడకు!" అన్నాడు చలపతి నవ్వుతూ.

అక్కడి వారంతా ఆ మాటలకి పకపకా నవ్వారు. ఆ సాయేబుకు నవ్వు వచ్చింది. మనసు కాస్త తేలికైంది.

"ఇక వెడతానయ్యా! దండాలు" అంటూ సాయేబు లేచాడు.

"దువ్వెనలు కోస్తా! కొమ్ము దువ్వెనలు కోస్తా!" అంటూ సాయేబు భుజాన సంచి తగిలించుకుని అరుగు దిగి తిరిగి బయలు దేరాడు.

అతనికి అలవాటు పడిన వీధి కుక్క ఒకటి తోకాడిస్తూ అతని వెంట నడిచింది. కొన్ని కాకులు 'కావు, కావు' మంటు చెట్ల మీద వాలి అరుస్తున్నాయి. "ఎంత హాయిగా బతుకుతున్నాయి ఈ కాకులు" అనుకుని నవ్వుకున్నాడు సాయేబు.

"ఆ సాయేబుదే కాదు ముసలితనం వస్తే అందరి గతి ఇంతే!" అందరి మనస్సుల్లో ఏదో ఆలోచన అల్లుకుంది. పేకాట ఆపేసి అందరు లేచారు.

"దువ్వెనలు కోస్తా! కొమ్ము దువ్వెనలు కోస్తా!" ఆ గొంతువిని ఆనందరావు భార్య రమణమ్మ, కూతురు రేవతి లోపల నుంచి వీధి అరుగు మీదికి వచ్చారు.

"అమ్మా! పిలిచారా! కొత్త దువ్వెనలు తెచ్చానమ్మా!" అంటు అరుగు దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. సంచిలోని కొత్త దువ్వెనలన్నీ చూపించాడు. రేవతి రెండు దువ్వెనలు బాగున్నాయని తీసుకుంది. రమణమ్మ చేతిలో ఉన్న పాత దువ్వెనలు అక్కడ పెట్టింది.

"ఇట్టే సరిచేసి ఇత్తానమ్మా!" అంటు సాయేబు వాటిని కోసి పాడైన పళ్ళు తీసేసి కొత్త పళ్ళు పెట్టి పదును చేసి అవి తిరిగి అక్కడ పెట్టాడు.

"అచ్చు కొత్త దువ్వెనలా ఉన్నాయమ్మా!" అంటు వాటిని తీసుకుంది రేవతి.

"ఆ దువ్వెనల సాయేబు ప్రత్యేకతే అది. కొత్త కొమ్ము దువ్వెనలు తయారు చెయ్యడం, పాతవికోసి కొత్తపళ్ళు పెట్టడం ఆ సాయేబుకు మంచి పేరు తెచ్చాయి. అతని పనితనం అందరిని ఆకర్షిస్తుంది. రమణమ్మ అన్నిటికి కలిపి 15 రూ॥ ఇచ్చింది.

"ముంతాజ్ ఎలా ఉందయ్యా!" అంటూ అడిగింది రమణమ్మ.

"ఏం చెప్పనమ్మా! ఢిల్లీ నుంచి తిరిగి వచ్చింది మొదలు జీవక్క కొడుకు మీది బెంగ, మరోపక్క ఉబ్బసవ్యాధి! లేవడం లేదమ్మా! ఓ ముద్ద కూడా నోటికి పోడం లేదమ్మా!" అన్నాడు.

"దానికేం మందిప్పించు ఆయాసం అదే తగ్గుతుంది!" ఇదిగో కాస్త పాత నిమ్మకాయ ఊరగాయ ఇస్తున్నా రెండు ముద్దలు తినమను" అంటూ ఆవిడ ఓ కొబ్బరి చిప్పలో పెట్టి ఓ వారంగా పెట్టింది.

"దండాలమ్మా!" అంటు సాయేబు ఆ కొబ్బరి చిప్ప అందుకుని లేచాడు.

అప్పటికే సూర్యుడు నడినెత్తిమీది కొచ్చాడు. కడుపులో ఆకలి నకనకలాడు తోంది. సాయేబు ఇక ముందుకు వెళ్ళలేక వెను దిరిగి ఇంటిదారి పట్టాడు.

ముంతాజ్ కాపురానికి వచ్చేటప్పటికి 18 సం॥ల వయసుతో పచ్చని ఛాయతో, పెద్ద పెద్ద కళ్ళతో తగిన పొడువుతో సన్నని నడుముతో చెక్కిన శిల్పంలా చూడ ముచ్చటగా ఉండేది. సాయేబు భార్య ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. సాయేబు తల్లిదండ్రులు పక్క ఊరిలోనే ఉండేవారు. చనిపోయిన పశువుల కొమ్ములు కోసి తెచ్చుకుని వాటిని సైజుగా చెక్కి తండ్రి దువ్వెనలు చేసి అమ్మేవాడు. తండ్రి నుంచి

సాయేబు ఆ వృత్తే స్వీకరించాడు. తల్లిదండ్రులు చనిపోయిన తరువాత ఈ వూరు వచ్చి అదే వృత్తిలో మరింత కొత్త రకాలతో ఆకర్షణీయంగా కొత్త దువ్వెనలు తయారు చేసి మంచితనంతో అందరికి తలలో నాలుకలా మసలుకుంటున్నాడు. ముంతాజ్ మిషన్ మీద రకరకాల జాకెట్లు కుట్టి డబ్బు సంపాదించేది. ఆ స్థలం కొనుక్కుని అందులో ఓ గుడిసె వేసుకుని సంతోషంగానే బతుకుతున్నారు.

ఒక్కగానొక్క కొడుకుని రెక్కలు ముక్కలు చేసుకొని చదివించాడు. కొడుకు కబీరు చాలా తెలివైనవాడు. ఇంజనీరింగ్ పాసై ఢిల్లీలో ఉద్యోగంలో చేరాడు. అక్కడే ఓ పెద్ద ఉద్యోగస్తుని కూతురితో ప్రేమ వివాహం చేసుకున్నాడు. సాయేబు, భార్య కొడుకు పెళ్ళికి వెళ్ళనేలేదు. కోడలిని చూడలేదు. తరువాత కొడుకు, కోడలితో వచ్చి ఓ గంట ఉండి వెళ్ళిపోయారు. కబీరు మాత్రం అప్పుడప్పుడు వచ్చి వెడుతూనే ఉన్నాడు.

"ఎందుకు ఆ పల్లెలో ఇంక ఇక్కడ వచ్చి ఉండండమ్మా!" అంటు కొడుకు పదే పదే చెబుతుంటే వెళ్ళడం, ఉండలేక వచ్చేయడం జరిగిపోయింది. గతం కళ్ళముందు కదిలేటప్పటికి సాయేబు కళ్ళు చెమర్చాయి.

"ముంతాజ్‌ను కొత్త డాక్టరుకి చూపించి మందులు వాడాలి! ఆమె మామూలు మనిషికావాలి?" అనుకున్న సాయేబు వడివడిగా అడుగులేసి ఇల్లు చేరుకున్నాడు.

బక్క చిక్కి మంచాన్ని అతుక్కుని పడుకున్న భార్యను చూసేటప్పటికి సాయేబు మనస్సు వికలమయింది. లేని ధైర్యం తెచ్చుకున్నాడు.

"ముంతాజ్ లే! లే! అమ్మగారు ఊరగాయ ఇచ్చింది. రెండు ముద్దలు తిందాం! లే! లే! కడుపులో ఆకలి దంచేస్తోంది!" అన్నాడు సాయేబు.

ముంతాజ్ మెల్లిగా లేచి కూర్చుంది. సాయేబు భుజాన ఉన్న సంచి ఓ మూల పెట్టి ఊరగాయ ఉన్న కొబ్బరి చిప్ప తెచ్చి ఆమె మంచం దగ్గరగా పెట్టాడు. పెరటివైపు వెళ్ళి కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కుని వచ్చాడు.

ముంతాజ్ పక్కనే వచ్చి కూర్చున్నాడు సాయేబు.

"రెండు కంచాలెందుకు?" అంటూ ఓ కంచం తీసి వారగా పెట్టి ఓ కంచంలోనె అన్నం పెట్టాడు సాయేబు. ఆవిడిచ్చిన ఊరగాయతో అన్నం కలిపి ఆమెకు రెండు ముద్దలు పెట్టి తాను తిన్నాడు. తరువాత ఇద్దరు మరింత కలుపుకుని తిన్నారు.

"అయ్యో! గిన్నెలు ఖాళీ అయ్యాయి! అంతా తినేసాం" అంటు చిన్న పిల్లల్లా ఇద్దరు పకపకా నవ్వుకున్నారు.

అంతలో తలుపు చప్పుడవడంతో సాయేబు ఎవరంటూ బయటకు వచ్చి చూసాడు. ఎదురుగా ముంతాజ్ చెల్లి కొడుకు నిలబడి ఉన్నాడు. వాడి కళ్ళు ఉబ్బి ఎర్రగా ఉన్నాయి. కన్నీళ్ళతో బుగ్గలు చారికలు కట్టి ఉన్నాయి.

"ఏటిరా? ఇలా వచ్చినావేటి?" సాయేబు అడగ్గానె ఆ పిల్లాడు వెక్కి వెక్కి ఏడుస్తూనె "పెద్దనాయనా అమ్మకి బాగలేదు. నిన్ను, పెద్దమ్మను అమ్మమ్మ ఎంటనే రమ్మనమని చెప్పింది" అన్నాడు.

"ఏటిరా! లోపలికి రా! రా! ఏటయింది?" అంటు అడిగింది ముంతాజ్.

తల్లికి జబ్బు చేసి పమాదంగా ఉందని తిరిగి అంతా వివరించి చెప్పాడు ఆ పిల్లాడు.

"ఎంటిరా! ఏదైనా తిన్నావా లేదా?" అంటు రెండు జొన్న రొట్టెలు చేసి తినిపించింది. మూటా, ముల్లె సర్దుకుని, తలుపుకు తాళం పెట్టి ఆ పిల్లాడి వెంట బయలు దేరారు. ముంతాజ్‌కి అంత ఓపిక ఎక్కడ నుంచి వచ్చిందో సాయేబుకు అర్థం కాలేదు. "పుట్టింటి మీది మమకారం" కాబోలు అనుకున్నాడు.

ఆ ముగ్గురు అక్కడికి చేరేటప్పటికి తల్లి శవం మీద పడి ముగ్గురు పిల్లలు వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. వాళ్ళను దగ్గరకు తీసుకుని ఓదార్చింది ముంతాజ్. తల్లి ఓ వారగా కూర్చుని బావురుమంది. ముంతాజ్ తల్లి దగ్గరగా వెళ్ళింది.

"అమ్మా! ఏడవకు! ఎవరికి ఈ నేల మీద ఎంత ఋణమో అంతే! ఏడ్చి ఏం లాభం! చనిపోయిన చెల్లి తిరిగి రాదుగా! పిల్లలు బెంబేలు పడతారు. ఊరుకో అమ్మా!" అంటూ తల్లి దగ్గరగా కూర్చుంది. సాయేబు చనిపోయినామె భర్తను ఓదార్చాడు.

ఎవరు నవ్వినా, ఏడ్చినా రోజులు ఆగలేదు. జరగవలసిన కార్యక్రమాలు జరిపించేసారు.

13 సం॥ పెద్దాడు కరీమ్ సాయేబు దంపతుల్ని వదలడం లేదు. వారివెంట వస్తానని పేచీపెట్టాడు.

ముసలి తల్లి కూడా అదే సలహా ఇచ్చింది. తరువాత ఆడపిల్ల అమ్మమ్మ దగ్గర ఉండటానికి మిగిలిన ఇద్దరు తండ్రి దగ్గర ఉండటానికి నిర్ణయించారు.

ముంతాజ్, సాయేబుల వెంట కరీం కూడా ప్రయాణమయ్యాడు. వాడు పెంచే ఓ కోడి పెట్టను కూడా వెంట తీసుకుని మరీ బయలుదేరాడు.

కరీమ్ చురుగ్గా ఉన్నాడు. ఆ దంపతుల్లో తిరిగి ఏదో కొత్త కాలక్షేపం, కొత్త మమకారం, తిరిగి చిగురించడం మొదలు పెట్టాయి.

కరీం వెంట తెచ్చుకున్న కోడి పెట్ట గుడ్లు పెట్టింది. అవి పిల్లలై కువ కువ మంటూ ఇల్లంతా తిరుగుతుంటె ఆ యింటి వైభవం తిరిగి వచ్చినట్లయింది. కొత్త మందులతో ముంతాజ్ కాస్త కోలుకోవడం మొదలు పెట్టింది. పైగా కరీమ్‌తో మరింత కాలక్షేపం, మరింత ఉత్సాహం ఆ దంపతులలో కలిగింది.

"ఈ పాక చాలడం లేదు. కొత్త ఇల్లు ఉంటే బాగుండేది?" అనే ఆలోచన ఆ దంపతుల్లో కలిగింది. కొడుకు కబీరు కొత్త యిల్లు కట్టిస్తానని ఎప్పటినుంచో అంటున్నమాటను ఇప్పుడు అంగీకరించారు ఆ దంపతులు.

కబీరు ఢిల్లీ నుంచి వచ్చి ఉన్న పాక పక్క స్థలంలో ఇల్లు కట్టించడం మొదలు పెట్టించాడు. పైగా కొత్త సామాను కూడా, ఇంటికి కొనిచ్చాడు.

కరీం రాకతో తల్లిదండ్రులు కాస్త కోలుకోవడం అతనికి తృప్తినిచ్చింది. తల్లిదండ్రులు వొంటరిగా ఉన్నారనే బెంగ అతనికి తీరింది. కబీరు ఇప్పుడు భార్యా పిల్లలతో తరచు వచ్చి వెడతానని తల్లిదండ్రులకు నచ్చ చెప్పాడు.

సాయేబు కరీమ్‌ను తిరిగి పాఠశాలలో చేర్పించాడు. పెద్ద చదువులు చెప్పించే శక్తిలేదు. తను భార్య అస్తమించే సూర్యునిలా పడమటి కొండవైపు ఉన్నారు. ఆ వూళ్ళో తన యింట్లో ఉండి బతికే జీవనాధారం చేకూర్చాలనుకున్నాడు.

"చూసినావా ఈడికి ఈ కొమ్ము దువ్వెనల వ్యాపారం పనికిరాదే" అన్నాడు ఒక రోజు భార్యతో.

"అదేటి?" ఆశ్చర్యంగా అడిగింది ముంతాజ్.

"చనిపోయిన పశువుల శరీరాలు కుళ్ళి కంపుకొడుతుంటే వాటి దగ్గరకు పోయి ఆ కొమ్ములు కోసి తెచ్చే ఈ యాపారం దేనికి? ఈ కరీం చేత ఇదిగో ఈ వీధి గదిలో గాజుల కొట్టు పెట్టిస్తా! ఇంటి పట్టున నీడలో ఉండి హాయిగా పెళ్ళాం పిల్లలతో బతుకుతాడే" అన్నాడు సాయేబు.

"నిజమే మరి! అసలు కంటె వడ్డీమీద ప్రేమ ఎక్కువట మరి నీ పెళ్ళాం సుఖపడలేదా?" అంటూ ముసిముసి నవ్వులు నవ్వింది.

"రోజులు మారాయి గదా! మనం మారాలి". అంటూ నవ్వాడు సాయేబు.

"అలాగా! మంచిగానె ఉంటుంది" అంది ముంతాజ్.

"అప్పటివరకు కరీంని నా ఎంట తిప్పుతా! పైగా ఆడిచేత రబ్బరు దువ్వెనలు, గాజులు పక్కూరి సంతకెళ్ళి తెచ్చి అమ్మిస్తా" అన్నాడు.

"ఆ ఆలోచనకి ముంతాజ్ చాలా సంతోషించింది. కరీం బడికి వెళ్ళి వస్తున్నాడు. పైగా సాయేబు వెంట ఊళ్ళో అమ్మకానికి తిరుగుతున్నాడు.

"కొమ్ము దువ్వెనలు కోస్తా!కొమ్ము దువ్వెనలు కోస్తా!" అంటు సాయేబు బయలు దేరాడు.

"రబ్బరు దువ్వెనలు, రకరకాల రబ్బరు దువ్వెనలు, రంగురంగుల రబ్బరు గాజులు!" అంటు సాయేబు వెంట కరీం బయలు దేరాడు.

సాయేబు గొంతుతోపాటు ఆ కొత్త గొంతువిని అందరు ఆశ్చర్యపోయారు.

"ఏమయ్యా! సాయేబు పిల్లాడిని బాగానే పెంచుతున్నావయ్యా! మంచి పని చేసావు?" అంటూ ఆనందరావు సంతోషంతో అడిగాడు.

"అవునయ్యా! బడికి వెళ్ళి చదువుకుంటున్నాడు. పైగా ఈ వృత్తి నేర్పిస్తున్నానయ్యా" అన్నాడు సాయేబు సంతోషంగా.

అందరు కొమ్ము దువ్వెనలతోపాటు రబ్బరు దువ్వెనలు, ఆకర్షణీయంగా ఉన్న రంగురంగుల రబ్బరు గాజులు కొన్నారు. సాయంకాలం అయ్యేటప్పటికి రబ్బరు దువ్వెనలు, రబ్బరు గాజులు పూర్తిగా అమ్ముడు పోయాయి.

సాయేబు ముఖం మతాబులా వెలిగింది. సాయంకాలం ఇంటి ముఖం పట్టిన సాయేబు వెంట బాల సూర్యునిలా అడుగు లేస్తున్న కరీమును చూసి

"ఎంతైనను సాయేబు దూరదృష్టికలవాడోయ్" అనుకున్నారు వూరి వారు.

మూసీ మాసపత్రిక జూన్ 2008.